సాక్షి సిద్దిపేట

గురువారం । 6 । మార్చి । 2025



సరికొత్త ఆవిష్కరణలు

కళాశాల స్థాయి నుంచే విద్యార్థులు పరిశోధనల వైపు అడుగులు వేస్తున్నారు.


వివరాలు 8లో ▸



మల్లంరాజు సేవలు..

మల్లంరాజు అందించిన సేవలు మరువలేనివని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు.

వివరాలు 9లో ▸



న్యూస్‌రీల్

పెండింగ్ పనులు పూర్తి చేయించండి

మంత్రి దామోదరకు వినతి



మంత్రి దామోదరతో టీపీసీసీ సభ్యుడు చంద్రం

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): జిల్లాలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించేలా చొరవ చూపాలంటూ మంత్రి దామోదర రాజనర్సింహను కోరినట్లు పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని మంత్రి రాజనర్సింహ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని మంత్రి తెలిపారన్నారు. జిల్లా అభివృద్ధికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసిమెలసి ముందుకు సాగాలని మంత్రి తెలిపారన్నారు.

బాధిత కుటుంబాలకు అండ



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

గజ్వేల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు గజ్వేల్ ప్రాంతంలోని ఉపాధ్యాయులు అండగా నిలిచారు. మెదక్ జిల్లా చేగుంట మండలం మక్కరాజ్‌పేట స్కూల్ కాంప్లెక్స్‌లో సీఆర్‌పీలుగా విధులు నిర్వహిస్తున్న రమేశ్‌నాయక్, శ్రీనివాస్‌ల ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన మృతిచెందారు. ఉపాధ్యాయులు రూ.1.90లక్షలు సేకరించి ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో బాధిత కుటుంబాలకు బుధవారం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు శశిధర్‌శర్మ, మల్లికార్జున్, నరేందర్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, అమర్నాథ రావు, రమణరావు, నరసింహ, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులను ప్రోత్సహిద్దాం

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: సేంద్రియ ఎరువుల తయారీని ప్రోత్సహించడానికి మున్సిపల్ ప్రత్యేక చర్యలు చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మంగమ్మతోటలో మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారం, సిల్ట్ తొలగించే పనులను పరిశీలించారు. ఆయా వార్డుల్లో వేసవిలో రాలుతున్న ఎండు ఆకులను చూసి వీటిని సేంద్రియ ఎరువుల తయారీకి వాడాలని, కంపోస్టు యార్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. 27 వార్డులో యూజీడి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కమిషనర్‌కు వివరించారు. ఆయన వెంట కౌన్సిలర్లు నాగరాజురెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నీట్ పరీక్ష కోసం కసరత్తు

పలు పాఠశాలలను పరిశీలించిన కలెక్టర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నీట్ పరీక్షల నిర్వహణకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. మే 4న పరీక్ష నిర్వహించనున్న దృష్ట్యా కేంద్రాల కోసం పట్టణంలోని పలు పాఠశాలల్లో మౌలిక వసతులను కలెక్టర్ మనుచౌదరి బుధవారం పరిశీలించారు. నేషనల్ టెస్టింగ్ కమిటీ మార్గదర్శకాల ప్రకారం పరీక్ష కేంద్రాలలో గదుల సంఖ్య, పార్కింగ్ సౌకర్యం, విద్యుత్ సరఫరా, ఫర్నిచర్‌లు ఉన్నాయా? లేదా? అని ఆరా తీశారు. నీట్ పరీక్ష నిర్వహణకు పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాలను ఎంపిక చేయనున్నారు. కలెక్టర్ వెంట డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాలువ తీరు.. కన్నీరే పారు

అచ్చుమాయపల్లి సమీపంలో కాలువ దుస్థితి



తలాపునే రిజర్వాయర్ ఉన్నా.. నీరు అందని చందంగా తయారైంది చాలా గ్రామాల పరిస్థితి. కాళేశ్వరం పథకంలో భాగంగా 50 టీఎంసీల సామర్థ్యంతో మల్లన్న సాగర్ రిజర్వాయర్‌ను తొగుట మండలంలో నిర్మించారు. ప్రాజెక్టు పూర్తయి నాలుగేళ్లు గడుస్తున్నా ఇంకా కాలువల నిర్మాణాలు పూర్తికాలేదు. దీంతో పంటపొలాలకు నీరందని దుస్థితి నెలకొంది. దుబ్బాక నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో చెరువులు, కుంటలను నింపే పరిస్థితి లేక పోవడంతో రైతులకు, ప్రజలకు నీటి తిప్పలు తప్పడంలేదు.

ఎవరికీ పట్టని మల్లన్నసాగర్ కాలువలు
- నాలుగేళ్లుగా అసంపూర్తిగానే నిర్మాణాలు
- చెంతనే ప్రాజెక్టున్నా పారని దుస్థితి
- ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించిన ఎమ్మెల్యేలు

దుబ్బాక: మల్లన్నసాగర్ ప్రాజెక్టు పూర్తయినా చాలా చోట్ల కాలువల నిర్మాణాలు పూర్తి కాలేదు. కాలువల నిర్మాణాలు నాలుగేళ్లుగా సాగుతునే ఉన్నాయి. దుబ్బాక పట్టణంలోని ముస్తాబాద్ రోడ్డులో కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో దుబ్బాక పెద్ద చెరువు, పెద్దగుండవెల్లి, దుంపలపల్లి, అచ్చుమాయపల్లి, జోడిచెర్ల, ఆరపల్లి, పోతారం, గంభీర్‌పూర్, శిలాజీనగర్ గ్రామాల్లోని చెరువులు, కుంటలకు నీరందడంలేదు. ఈ సారైనా కాలువ పూర్తి అవుతుందనే ఆశతో పంటలు వేసుకోగా తీరా కాలువ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో వేసిన పంటలు చేతికొస్తాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. త్వరగా కాలువ నిర్మాణం పూర్తి చేసి తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి విన్నపాలు..

మల్లన్నసాగర్ ప్రాజెక్టు అనుసంధానంగా నీరందించే కాలువల నిర్మాణాలు చాలా చోట్ల పెండింగ్‌లో ఉన్నాయంటూ పలుమార్లు ఎమ్మెల్యేలు హరీశ్ రావు, కొత్తప్రభాకర్‌రెడ్డిలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనూ చర్చించారు. త్వరగా కాలువలు పూర్తి చేయాలని విన్నవించారు.



మధ్యలోనే నిలిచిన కాల్వ నిర్మాణ పనులు

గ్రామాలకు నీరందని దుస్థితి

మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు కేవలం 10–15 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న మిరుదొడ్డి మండలంతో పాటు అక్బర్‌పేట–భూంపల్లి, దౌల్తాబాద్, రాయపోల్ మండలాల్లోని చాలా గ్రామాలకు కాలువల నీరు అందని పరిస్థితి నెలకొంది. మల్లన్నసాగర్ రిజర్వాయర్ కేవలం ఏడెనిమిది కిలోమీటర్ల దూరంలోనే ఉన్నా తొగుట మండలంలోని గుడికందుల, గోవర్ధనగిరి, వర్ధరాజుపల్లి గ్రామాల్లో కాలువల నీరు రాక వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలోని చేగుంట, నార్సింగ్ మండలాల్లో సైతం కాలువ నిర్మాణానికి అటవీశాఖ అధికారుల అనుమతి నిరాకరించడంతో మధ్యలోనే నిర్మాణం ఆగిపోయింది.

కాల్వలపై అశ్రద్ధ తగదు



మల్లన్నసాగర్ కాలువల నిర్మాణాలపై అశ్రద్ధ తగదు. త్వరగా పూర్తి చేసి చెరువులు, కుంటలకు నీరందించి పంటలను కాపాడాలి. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని కలిసి కోరాం. అసెంబ్లీ సమావేశాల్లోనూ దృష్టికి తీసుకువచ్చాం. యాసంగిలో నీళ్లు లేక చాలాచోట్ల పంటలు ఎండిపోతున్నాయి.

–కొత్త ప్రభాకర్‌రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే

పంటలను కాపాడండి



కాలువ పూర్తయి తమ పొలాలకు నీరందుతుందనే ఆశతో వరి నాట్లు వేసుకున్నాం. ఇప్పటికీ పూర్తికాకపోవడం.. ఎండాకాలం కావడం.. బోర్ల నుంచికొద్దిపాటి మాత్రమే నీరు వస్తుండటంతో పంటలు ఎండిపోతున్నాయి. పెద్ద చెరువులోకి నీళ్లు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

–గోపాల్‌రెడ్డి, రైతు దుబ్బాక

ఇప్పటికే సగం ఎండిపోయింది



వేసిన పంటలు నీళ్లు లేక ఎండిపోతున్నాయి. 4 ఎకరాలు వరి వేస్తే ఇప్పటికే సగం ఎండిపోయింది. కాలువల నీరు వస్తదనకుంటే ఇంత వరకు కాలువ పూర్తి చేస్తలేరు. అంతా అయోమయంగా ఉంది. కాలువ నిర్మాణం పూర్తి పంటలను కాపాడాలి.

–రేపాక రాజిరెడ్డి,రైతు

రైతులు అధైర్యపడొద్దు



తపాస్‌పల్లి రిజర్వాయర్ వద్ద ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

- తపాస్‌పల్లికి పదిరోజుల్లో నీళ్లు
- రిజర్వాయర్ నింపాలని అధికారులను ఆదేశించాం
- భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): 'తపాస్‌పల్లి రిజర్వాయర్ కింద వరి పంట వేసిన రైతులు అధైర్యపడొద్దు. పది రోజుల్లో రిజర్వాయర్‌కు నీటి పంపింగ్ చేస్తా'మని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. బుధవారం స్థానిక రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈసందర్భంగా రిజర్వాయర్ లోకి నీళ్లు వచ్చేలా తక్షణం చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులతో ఎంపీ మాట్లాడారు. పంటలు ఎండి పోకుండా పొలాలకు నీరు అందిస్తామని హామీ చెప్పారు. పొలాలకు నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశ్యంతోనే రిజర్వాయర్‌ను సందర్శించినట్లు తెలిపారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీళ్లు రావాలంటే ముందున్న ధర్మసాగర్, బొమ్మకూరు రిజర్వాయర్‌లలో నీటి లభ్యత తక్కువగా ఉందన్నారు. ముందు వాటిని నింపిన తర్వాతే తపాస్‌పల్లికి నీరు వస్తుందని తెలిపారు. వెంటనే ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో మాట్లాడి త్వరగా నీళ్లు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మద్దూరు మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్ రెడ్డి, చేర్యాల మాజీ జెడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, నాగపురి కిరణ్‌కుమార్, కొమురవెల్లి మల్లన్న ఆలయ ధర్మకర్తలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంగనాయకసాగర్, తపాస్‌పల్లి కాలువలను కలపండి

మద్దూరు(హుస్నాబాద్): భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం చేర్యాల మండల పరిధిలోని కమలాయపల్లి, అర్జున్‌పట్ల గ్రామాలను సందర్శించారు. రంగనాయకసాగర్ ఎల్‌డీ–10, తపాస్‌పల్లి డీ–3 కాలువలను పరిశీలించారు. రంగనాయకసాగర్ కాలువలో సాగునీరు ఉండగా, తపాస్‌పల్లి కాలువలో మాత్రం సాగునీరు లేకపోవడాన్ని గుర్తించారు. ఇదేవిషయాన్ని తపాస్‌పల్లి కాలువ నీటితో సాగు చేసే రైతులు ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. అయితే రంగనాయకసాగర్ కాలువ, తపాస్‌పల్లి కాలువలను కలిపే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఫోన్ ద్వారా నీటిపారుదలశాఖ అధికారులకు సూచించారు. కాలువలకు ఇరువైపుల ఉన్న రైతులు ఇదేవిషయాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి సైతం తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. ఈ ఐదు గ్రామాల పరిధిలో 12వేల సాగు ఉంటుందని, ఈ కాలువలతో సాగు స్థిరీకరణ అయ్యే విధంగా కృషి చేస్తానన్నారు.



సాగునీటి కాలువలను పరిశీలిస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి



హాల్‌టికెట్లను తనిఖీ చేస్తున్న అధ్యాపకులు

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

అదనపు కలెక్టర్ గరీమాఅగర్వాల్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు నాణ్యత పాటించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. ప్రజ్ఞాపూర్‌లోగల మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. పాఠశాలలోని వంట గదిని, వినియోగించే నిత్యావసర సరుకులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మెనూ తప్పక పాటించాలన్నారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల పట్ల భయం పెట్టుకోవద్దని, ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా పరీక్షలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రావణ్, ఎంఈఓ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తొలిరోజు 95శాతం హాజరు

- ఇంటర్ పరీక్షలు షురూ..
- పర్యవేక్షించిన అధికారులు

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లాలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్, ఒకేషనల్ విద్యార్థులకు జనరల్ ఫౌండేషన్ కోర్సు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 43 పరీక్షా కేంద్రాల్లో జనరల్, ఒకేషనల్ రెండు విభాగాల్లో 10,542 మంది విద్యార్థులకు 9,976 మంది హాజరయ్యారు. 95శాతం హాజరు నమోదు అయింది. కలెక్టర్ మనుచౌదరి పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలతో పాటు పలు ప్రైవేట్ కళాశాలల పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. అదనపు కలెక్టర్లు అబ్దుల్‌హమీద్ చేర్యాల, ముస్త్యాల పరీక్షా కేంద్రాలను, కొండపాక పరీక్షా కేంద్రాలను గరిమా అగర్వాల్ తనిఖీ చేశారు. ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి సిద్దిపేట ప్రభుత్వ కోఎడ్యుకేషన్, బాలికల కళాశాలలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు డీఈసీ సభ్యులతో పాటు రెండు ఫ్లైయింగ్, మూడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయన్నారు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ కస్టోడియన్ పాయింట్‌ను ఇంటర్ బోర్డు అధికారులు సందర్శించారు.



పట్టణంలోని పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

పక్కా ప్రణాళిక.. పకడ్బందీ వ్యూహం

- కలిసొచ్చిన బీజేపీ క్యాడర్
- ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయానికి కారణాలివే..



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పక్కా ప్రణాళిక.. పకడ్బందీ వ్యూహం. ఇవి శాసన మండలి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలుపు తీరాలకు చేర్చాయి. ఉమ్మడి కరీంనగర్–మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన రామచంద్రాపురానికి చెందిన చిన్నమైల్ అంజిరెడ్డి విజయానికి ఈ రెండు కారణాలని రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఈ ఎన్నికలను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మరోవైపు బీఎస్పీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ప్రసన్న కూడా గట్టి పోటీని ఇచ్చారు. ముగ్గురు అభ్యర్థుల మధ్య హోరాహోరీగా మండలి పోరు సాగింది. మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలుపు తేల్చలేని పరిస్థితి నెలకొంది. దీంతో రెండో ప్రాధాన్యత ఓటును లెక్కించగా.. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించారు.

అండగా నిలిచిన కమలం క్యాడర్

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో బీజేపీకి గట్టి క్యాడర్ ఉంది. ఉమ్మడి మెదక్‌తో పాటు, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో బీజేపీ బలంగా ఉంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ ఎంపీ స్థానంతో పాటు, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో ఎంపీలుగా ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించిన విషయం విదితమే. అలాగే ఆయా జిల్లాలో బీజేపీ ఎమ్మెల్యేలుగా కూడా ఈ నాలుగు జిల్లాలకు చెందిన వారే ఉన్నారు. ఈ ఎన్నికలను ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో బీజేపీ క్యాడర్ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఆయా నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలు రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, బండిసంజయ్, గొడాం నగేష్‌లకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. అలాగే బీజేపీ ఎమ్మెల్యేలు కూడా ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఇలా ఆయా ఉమ్మడి జిల్లాల్లో బీజేపీకి గట్టి పట్టు అంజిరెడ్డిని గెలుపు తీరాలకు చేర్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బీజేపీ అనుబంధ సంఘాలు కీలకం..

బీజేపీ అనుబంధ సంఘాలు కూడా ఈ ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఉమ్మడి కరీంనగర్ – మెదక్ – నిజామాబాద్ – ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని కూడా బీజేపీనే కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితమే టీచర్స్ ఎమ్మెల్సీ ఫలితాలు వెల్లడయ్యాయి. ఇప్పుడు పట్టభద్రుల స్థానాన్ని కూడా కమలం పార్టీ తన ఖాతాలో వేసుకుంది. ఈ రెండు స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపులో ఆ పార్టీ క్యాడర్‌తో పాటు, దాని అనుబంధ సంస్థల కృషి ఎంతగానో ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీరు పకడ్బందీగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎలాంటి హంగూ.. ఆర్భాటాలు లేకుండా అభ్యర్థుల గెలుపులో కీలక పాత్ర పోషించారని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాగా ఎన్నికల నగారా మోగక ముందు నుంచే అంజిరెడ్డి ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై దృష్టి సారించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న పట్టభద్రులను పెద్ద ఎత్తున ఓటర్లు నమోదు చేయించారు. ఇలా ఓటరు నమోదు చేయించడం ఆయనకు కొంత కలిసొచ్చింది.

ఎమ్మెల్యేగా పోటీ చేసి..

పారిశ్రామిక వేత్త అయిన డా.చిన్నమైల్ అంజిరెడ్డి 2009లో రాజకీయాల్లో అడుగుపెట్టారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఎస్‌ఆర్.ట్రస్టు ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అంజిరెడ్డి సతీమణి గోదావరి బీజేపీ అధ్యక్షురాలిగా కొనసాగుతున్న విషయం విదితమే.

సామాజిక సేవ..

2002 ఎస్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ స్థాపన. పెద్ద ఎత్తున తాగునీరు, మినరల్ వాటర్, విద్యార్థులకు పుస్తకాలు, స్కాలర్‌షిప్‌లతో పాటు మరిన్ని సేవా కార్యక్రమాల నిర్వహణ.

అంజిరెడ్డి బయోడేటా..

పేరు:	డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి
పుట్టిన తేదీ:	18.06.1966
తల్లిదండ్రులు :	సి.రాజిరెడ్డి, లక్ష్మీనరసమ్మ
భార్యపేరు:	సి.గోదావరి (బీజేపీ జిల్లా అధ్యక్షురాలు)
సంతానం :	అనీష్‌రెడ్డి, అశ్విత రెడ్డి
స్వస్థలం :	రామచంద్రాపురం

రాజకీయ ప్రస్థానం ఇలా..

2009లో ప్రజారాజ్యంలో చేరిక. వైఎస్సార్ సీపీలో పనిచేశారు. 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పటాన్‌చెరు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి.. ఓటమి పాలయ్యారు. తర్వాత కాంగ్రెస్‌లో చేరిక.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సందర్భంగా బీజేపీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీ టిక్కెట్‌ను ఆశించి భంగపడ్డారు. మండలి ఎన్నికల్లో ఎమ్మెల్సీగా విజయం.

కాళేశ్వరంపై నిర్లక్ష్యం తగదు

ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్‌ఎస్ పార్టీపై, కేసీఆర్ మీద కోపంతో కాళేశ్వరంపై నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని రంగనాయక సాగర్‌లోకి నీటి పంపింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాళేశ్వరం పిల్లర్ కుంగిపోయి 14 నెలలు అవుతున్నా ఇప్పటికీ బాగు చేయలేదన్నారు. ఎస్సారెస్పీ స్టేజీ 2 ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్నారు. గతంలో ఎస్సారెస్పీ నీరు తగ్గినప్పటికీ కాళేశ్వరం ద్వారా రెండు పంటలకు సాగు నీరు అందించామన్నారు. అన్ని వర్గాలకు మంచి చేసే ప్రాజెక్టును నిర్లక్ష్యం చేయకూడదన్నారు.



రంగనాయక సాగర్‌లోకి నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

క్లుప్తంగా

అందరికీ సమాన హక్కులు

న్యాయమూర్తి స్వాతిరెడ్డి



మాట్లాడుతున్న స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: రాజ్యాంగంలో ఆర్టికల్ 14 ద్వారా అందరికీ సమాన హక్కులు ఉన్నాయని న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో బుధవారం లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఆడపిల్లలు, మగపిల్లల మధ్య వ్యత్యాసం చూపకూడదన్నారు. ఎవరైనా ప్రేమ పేరుతో వేధింపులకు గురి చేస్తే తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యానికి చెప్పాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో మంచి ఉద్యోగంలో స్థిరపడాలని సూచించారు. నర్సింగ్ విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా లీగల్ సర్వీసెస్ అథారిటీ లేదా 15100కు ఫోన్ చేయాలని తెలిపారు. సిద్దిపేట కోర్టు భవనంలో కోర్టు మహిళా సిబ్బంది, మహిళ న్యాయవాదులకు ఫుడ్ కాంపిటీషన్ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మిలింద్‌కాంబ్లీ, తరణి, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నీరందించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సత్తిరెడ్డి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వం తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను నింపి ఈ ప్రాంతంలో ఉన్న యాసంగి పంటలకు నీరు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలకు సాగు నీటిని అందించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం కార్యకర్తలతో కలసి ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వేణుగోపాల్ రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, బక్కెల్లి బాలకిషన్, తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మోపులు దగ్ధం



తగులబడుతున్న గడ్డిమోపులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో బుధవారం ఉదయం గడ్డిమోపులను లోడ్ చేసుకొని వెళ్తున్న డీసీఎం వ్యాన్‌కు విద్యుత్ వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన వ్యాన్ డ్రైవర్ సమీపంలోని నీటి కాల్వలోకి వ్యాన్ తీసుకెళ్లి మోపులను కూలీల సహాయంతో తీసే ప్రయత్నం చేశారు. అప్పటికే గడ్డి మోపులు దగ్ధమయ్యాయి.

దొంగతనం కేసులో జైలు శిక్ష

మిరుదొడ్డి(దుబ్బాక): లోక్ అదాలత్‌లో దొంగకు జైలు శిక్ష పడినట్లు మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పరశురాములు తెలిపారు. బుధవారం ఆయన కథనం మేరకు.. మిరుదొడ్డి పీఎస్ పరిధిలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం గ్రామానికి చెందిన కొంపల్లి భాను ప్రకాశ్‌పై 2024 ఏప్రిల్ 23న దొంగతనం కేసు నమోదైంది. ఈ కేసుపై లోక్ అదాలత్‌లో భాగంగా దుబ్బాక మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగిందని తెలిపారు. కేసు విచారణ అనంతరం భాను ప్రకాశ్‌కు 35 రోజుల జైలు శిక్షతో పాటు, రూ. వెయ్యి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

కొత్త ఆలోచనలు.. నూతన ఆవిష్కరణలు

- పరిశోధనల వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులు
- రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులు
- హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



బేటీ బచావో బేటీ పడావో ప్రాజెక్టుపై ప్రజెంటేషన్ ఇస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్: కళాశాల స్థాయి నుంచి విద్యార్థులు పరిశోధనల వైపు అడుగులు వేస్తున్నారు. వినూత్న ఆలోచనలకు తగ్గట్లుగా కొత్త ఆవిష్కరణలకు పదును పెడుతున్నారు. కళాశాల అధ్యాపకులు విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా ప్రోత్సహిస్తూ, శాస్త్రీయ ఆవిష్కరణలపై ఆసక్తిని పెంచుతున్నారు.

హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన రెండు ప్రాజెక్టులు జిజ్ఞాస స్టేట్ లెవల్ స్టడీ ప్రాజెక్టుకు ఎంపికయ్యాయి. వృక్ష శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పర్శనేని బాలరాజు ఆధ్వర్యంలో నేత ఉత్పాదకతను పెంచడంలో జీవ ఎరువు అజోల్ల వాడకం అనే అంశం. అలాగే రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు గుగులోతు విజయ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో అనే అంశంపై చేసిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపికయ్యాయి. నేల సారాన్ని పెంచడానికి రసాయనాల ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవ ఎరువు వాడకం పైన పరిశోధనలు చేశారు. అలాగే లింగ వివక్షతను తొలగించి ఆడపిల్లలకు ఉన్నత చదువులు అందించాలనే ఆడపిల్లల ప్రాముఖ్యతను తెలియజేస్తూ సమాజానికి ఉపయోగపడే పరిశోధనలు చేస్తున్నారు.

అజోల్ల జీవ ఎరువు

వరి సాగు చేసే పంట పొలాలకు నేలను సారవంతం చేసి ఎంతో దిగుబడి పొందడానికి అజోల్ల మొక్క ఉపయోగపడుతుంది. చేపల దానగా, పౌల్ట్రీ ఫామ్‌ల్లో కోళ్లకు దానగా ఉపయోగపడుతుంది. టూ బై సిక్స్ ఫీట్ గుంతలో సారవంతమైన మట్టిని పొరగా పొందుపర్చాలి. సగం వరకు నీటితో నింపి అజోల్ల విత్తనాన్ని ప్రవేశపెట్టాలి. మూడు నుంచి నాలుగు వారాల సమయంలో అజోల్ల పెరుగుతుంది. దీనిని పచ్చిరొట్టగా పొలంలో వేసి దున్నుతారు. అజోల్ల జీవ ఎరువుగా పని చేస్తుంది. ఇక హెక్టార్ భూమిలో అజోల్లాను జీవ ఎరువుగా వాడినప్పుడు సుమారుగా 25 కేజీల నత్రజని మొక్కలకు అందుతుంది. దీంతో రసాయన ఎరువులు వాడనవసరం లేదు. పాజెక్టులో బీజెడ్‌సీ విద్యార్థులు జ్యోతి, సంగీత, అంకిత, విష్ణువర్ధన్, యామిని పాల్గొన్నారు.

ఆడపిల్లల్లో ఆత్మ స్థైర్యాన్ని పెంచాలి



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షపతి

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బాలికలను రక్షించడం కోసం రూపొందించిన బేటీ బచావో బేటీ పడావో సత్ఫలితాలు ఇచ్చిందని విద్యార్థులు తమ పరిశోధనల్లో తేలిందని చెబుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా స్త్రీ విద్య పెరగడానికి తోడ్పడుతుంది. ఈ పథకాన్ని ప్రధాని నరేంద్రమోదీ 2015లో ప్రారంభించారు. లింగ వివక్షతను తొలగించి ఆడపిల్లలకు ఉన్నత విద్యను అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రుల్లో, ప్రజల్లో ఆడపిల్లల ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆత్మరక్షణకు చర్యలు తీసుకుంటూ వారికి స్వీయ శిక్షణను అందించాలి. ఆడపిల్లల స్వేచ్ఛా స్వతంత్రాలను కాపాడే విధంగా ఆత్మస్థైర్యాన్ని పెంచే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. ఈ ప్రాజెక్టు తయారీలో హర్షవర్ధిని, మానస, శ్రీవాణి, సమీనా, రషీద, నిక్షిప్త పాల్గొన్నారు.

స్త్రీల అక్షరాస్యత పెరిగింది



మేము బేటీ బచావో బేటీ పడావో అనే అంశం పై పరిశోధన చేశాం. బాలికల విద్యను ప్రోత్సహించడానికి, లింగ అసమానతలు తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. పది ఏళ్ల కాలంలో ఈ కార్యక్రమం యొక్క ప్రభావాన్ని మా పరిశోధన ద్వారా తెలుసుకున్నాం. విద్యతోనే అన్ని సమస్యలకు పరిష్కారం. దీని ద్వారా స్త్రీల అక్షరాస్యత పెరిగి, భ్రూణ హత్యలు తగ్గాయి.

– దుండ్ర హర్షవర్ధిని, బీఏ, ద్వితీయ సంవత్సరం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్

ఖర్చు తక్కువ.. దిగుబడి ఎక్కువ



జిజ్ఞాస అనే ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రతీ సంవత్సరం విద్యార్థులం అందరం వివిధ ప్రాజెక్టులు రూపొందిస్తాం. అజోల్ల పెంపకం సులవైన విధానం. రైతులు వారి పొలాల్లో సులువుగా పెంచుకోవచ్చు. అజోల్ల అనేది ఒక చౌకైన బయో ఫర్టిలైజర్. దీని వాడకం ద్వారా నేల కాలుష్యాన్ని తగ్గించవచ్చు. తక్కువ ఖర్చుతో రైతులు అధిక దిగుబడి పొందవచ్చు. రసాయన ఎరువులు వాడనవసరం లేదు.

– విష్ణువర్ధన్, బీఎస్సీ, ద్వితీయ సంవత్సరం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్

రైతులకు ఉపకరిస్తుంది



జీవ ఎరువు అజోల్ల వాడకం వల్ల నేత ఉత్పాదకత పెరుగుతుంది. అజోల్ల పెంపకం అనేది తక్కువ ఖర్చుతో కూడుకున్నది. ఇది రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా వాడవచ్చని విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. మా విద్యార్థుల పరిశోధన రైతులకు ఉపకరిస్తుంది. విద్యార్థులను పరిశోధనల వైపు మళ్లించేందుకు ప్రోత్సహిస్తున్నాం. ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– డాక్టర్ బాలరాజు, వృక్షశాస్త్ర అధ్యాపకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుస్నాబాద్

మతి స్థిమితంలేని యువతిపై అత్యాచారం

- మద్యం మత్తులో దాష్టీకానికి ఒడిగట్టిన యువకుడు
- అందోల్ మండలంలో వెలుగులోకి..

వట్‌పల్లి(అందోల్): మతి స్థిమితం సరిగ్గాలేని యువతిపై ఓ యువకుడు అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన సంగారెడ్డి జిల్లా అందోల మండల పరిధిలోని నేరడిగుంట గ్రామంలో నాలుగు రోజుల ఆలస్యంగా బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన యువతి(24)కి చిన్ననాటి నుంచి మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో కుటుంబీకులు ఆమెకు పెళ్లి చేయలేదు. యువతి ప్రతిరోజూ గ్రామంలో ఉదయం నుంచి రాత్రి వరకు అటు ఇటూ తిరిగి ఇంటికి చేరుకునేది. ఇదే క్రమంలో గ్రామానికి చెందిన మన్నె శంకర్ అనే యువకుడు మద్యం మత్తులో ఆ యువతిని పొలం వద్దకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయమై యువతి తల్లి నాగమణి మంగళవారం జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేయగా, సీఐ అనిల్‌కుమార్ బుధవారం నేరడిగుంట గ్రామానికి చేరుకొని ఘటనపై విచారణ జరిపారు. బాధిత యువతిని వైద్య పరీక్షల నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గీతా స్కూల్‌కు జాతీయ స్థాయి అవార్డు

పాఠశాల కరస్పాండెంట్ రామాంజనేయులుకు గౌరవ డాక్టరేట్



రామాంజనేయులుకు గౌరవ డాక్టరేట్ అందజేస్తున్న డబ్ల్యూసీఈపీసీ ప్రతినిధులు

తూప్రాన్: విద్యా వ్యవస్థలో 31 ఏళ్లుగా విద్యాసంస్థ అందిస్తున్న సేవలకు పట్టణంలోని గీతా స్కూల్‌కి జాతీయ స్థాయి అవార్డు లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పిన్నక రామాంజనేయులు పేర్కొన్నారు. డబ్ల్యూసీఈపీసీ సంస్థ బుధవారం ఢిల్లీ తీన్ మూర్తి భవన్‌లోని ప్రధాన మంత్రి సంగ్రహాలయంలో ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉత్తమ, నాణ్యమైన విద్య, ప్రతీ సంవత్సరం 120 మంది విద్యార్థులకు తగ్గకుండా ఉచిత విద్యాబోధన, 2016లో దేశ వ్యాప్తంగా మంజూరైన ఆరు ఏటీఎల్ ల్యాబ్‌లలో దక్షిణ భారత దేశంలో మొదటిగా పొందిన విద్యా సంస్థగా గుర్తింపు పొందడంతో వీటిని పరిగణనలోకి తీసుకొని ఈ అవార్డును అందజేసినట్లు పేర్కొన్నారు. అలాగే విద్యావ్యవస్థలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు రామాంజనేయులును సంస్థ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ పీ.ఉష, డైరెక్టర్లు బీ.రాఘవేంద్ర గౌడ్, నారాయణ గుప్త, ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకట కృష్ణరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

గదరాజు చందుకు కేసీఆర్ అభినందనలు



కేసీఆర్‌కు పుస్తకాన్ని అందిస్తున్న చందు

చేర్యాల(సిద్దిపేట): ఇటీవల డాక్టరేట్ పట్టా పొందిన మండలంలోని కడవేర్గు గ్రామానికి చెందిన గదరాజు చందును మాజీ సీఎం కేసీఆర్ అభినందించారు. ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో జనగామ ఎమ్మెల్యే డా.పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి కేసీఆర్‌ను కలిశారు. చందు ఇటీవల ఓయూ ప్రొఫెసర్ ఎం.గోనానాయక్ పర్యవేక్షణలో రాష్ట్రంలో దొమ్మర కులస్తుల సంస్కృతీ, సాహిత్య పరిశీలన అంశంపై పరిశోధన చేసి పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని కేసీఆర్‌కు అందజేసి పరిశోధన విషయాలన్నీ వివరించారు. ఈ సందర్భంగా కేసీఆర్ స్పందిస్తూ తెలంగాణ ఆదిహిందూ జాతికులాల సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ తెలంగాణ బిడ్డలపై ఉందన్నారు. గ్రామీణ ప్రాంత బిడ్డగా అరుదైన పరిశోధన జరిపిన చందును అభినందించారు. ఆయన వెంట రాళ్లబండి చందు, బొంగురం జితేందర్‌రెడ్డి ఉన్నారు.

జాబ్ మేళాకు స్పందన



ఇంటర్వ్యూ తీసుకుంటున్న సంస్థ ప్రతినిధి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. ఇండిగో విమానయాన సంస్థలో డ్రైవర్లు, లోడర్ల జాబుల కోసం ఏజీఐఎల్‌ఈ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఈ ఇంటర్వ్యూకు 129 మంది హాజరయ్యారు. ఇందులో హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్లుగా 60, లైట్ మోటార్ వెహికల్ డ్రైవర్లుగా 25 మంది, లోడర్లు 43 మంది, టెక్నీషియన్‌గా ఒకరిని ఎంపిక చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- రాష్ట్ర, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందుతున్న జక్కాపూర్ పాఠశాల
- వార్షికోత్సవ వేడుకల్లో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: జక్కాపూర్ ఉన్నత పాఠశాల రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ప్రత్యేక గుర్తింపు పొందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను బుధవారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, దానికోసం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు షౌకత్‌అలీ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ బృందం సమిష్టిగా పనిచేస్తూ పదవ తరగతిలో ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే 13 మంది విద్యార్థులు ఉపకార వేతనానికి అర్హత సాధించారని, అదే విధంగా గణిత, సైన్స్ ఫోరమ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించే టాలెంట్ టెస్టుల్లో కూడా పాఠశాల విద్యార్థులు ప్రతిభ సాధిస్తున్నారన్నారు. అనంతరం సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రామస్వామి, ఎంఈఓ గౌరిమోహన్, కాంప్లెక్స్ ప్రిన్సిపాల్ శోభారాణి పాల్గొన్నారు.

సైన్స్ అంటేనే వాస్తవికతకు నిదర్శనం

దుబ్బాకటౌన్: సైన్స్ అంటేనే వాస్తవికతకు నిదర్శనమని, ఎల్లప్పుడూ మన జీవితంలో శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి మూఢ నమ్మకాలను విడనాడి వాస్తవాలను మాత్రమే ఆచరించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బుధవారం రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు చేసిన ప్రయోగ నమూనాలను పరిశీలించి అవి పని చేసే తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు సాదత్ అలీ, ఎంఈఓ సత్యనారాయణ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు అంజిరెడ్డి పాల్గొన్నారు.

నిధుల్లేక నిలిచిపోయాయి

- రెండేళ్లు కావొస్తున్నా పూర్తికాని హెల్త్ సబ్ సెంటర్ల భవనాలు
- జిల్లాలో 124 నిర్మాణాలు ప్రారంభం
- పూర్తయిన భవనాలు 25 మాత్రమే




హత్నూరలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవనం నిర్మాణం

హత్నూర (సంగారెడ్డి): గ్రామీణ ప్రాంత ప్రజల అనారోగ్య సమస్యలపై వైద్యం అందించేందుకు ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలు (హెల్త్ సబ్ సెంటర్లు) నిధుల లేమితో కునారిల్లుతు న్నాయి. భవన నిర్మాణాలకు గత ప్రభుత్వం నిధులిచ్చినా అవి చాలక అసంపూర్తిగా మిగిలిపోయాయి. జిల్లాలో మంజూరైన ఆరోగ్య ఉపకేంద్రాల్లో కేవలం ఎనిమిది సెంటర్లకు మాత్రమే భవననిర్మాణ పనులు పూర్తికాగా మిగిలిన వాటికి నిర్మాణాలు ఎప్పుడు పూర్తవుతాయోనని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

ఒక్కో భవనానికి రూ.20 లక్షలు చొప్పున

జిల్లాలో గత ప్రభుత్వం 124 హెల్త్ సబ్ సెంటర్ల భవన నిర్మాణాల కోసం ఒక్కొక్క దానికి రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఇందులో 25 ఆరోగ్య ఉపకేంద్రాల భవన నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. రూ.20 లక్షలతో పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తికాదని కాంట్రాక్టర్లు మొండికేసి పనులను నిలిపివేశారు. హత్నూర మండలంలోని పలు గ్రామాలకు మంజూరైన 8 ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్ల భవనాల నిర్మాణాల్లో కొన్నింటికి మాత్రమే టెండర్లు పిలువగా కొంతమేర పనులు జరిగాయి. కొన్ని భవన నిర్మాణాలకు కనీసం పనులు కూడా ప్రారంభించలేకపోవడంతో గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఈ ప్రభుత్వం విడుదల చేస్తుందా లేదోనని ఆందోళన మొదలైంది. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రమైన హత్నూరలో భవన నిర్మాణం ప్రారంభించినప్పటికీ నేటికీ పనులు పూర్తి కాలేకపోయాయి. హత్నూర ఐటీఐ కాలనీకి మంజూరైన భవన నిర్మాణం పనులు కనీసం ప్రారంభించలేదు. మండలంలోని చింతల్చెరు,బోరపట్ల, దౌల్తాబాద్, సిరిపుర, గ్రామాలకు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి భవన నిర్మాణాలను పూర్తి చేసి గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలకు వైద్యం అందించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


భవనం త్వరగా పూర్తి చేయాలి



హత్నూరలో రెండేళ్లుగా హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం పనులు పూర్తికాలేదు. దీంతో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించాలి.

–ప్రవీణ్ గౌడ్, హత్నూర

మార్చి నాటికి పూర్తవుతాయి



జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రాల భవన నిర్మాణాలు మార్చి నెలాఖరు నాటికల్లా పూర్తి చేయాలని కలెక్టర్ సైతం ఆదేశాలు జారీ చేశారు. నిధులు సరిపోకపోవడం వల్లే పనులు ఆగిపోయాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. నిధులు అవసరం ఉంటే మంజూరు చేసేందుకు కలెక్టర్ చర్యలు తీసుకుంటారు. –గాయత్రీ దేవి, జిల్లా వైద్యాధికారి

మా అమ్మ మృతికి తమ్ముడే కారణం?

మృతురాలి కుమార్తె పోలీసులకు ఫిర్యాదు

తూప్రాన్: మా అమ్మ మృతికి తమ్ముడే కారణమని, ఓ సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ఎస్ఐ శివానందం కథనం మేరకు.. మండలంలోని గుండ్రెడ్డిపల్లికి చెందిన చింతల పోచమ్మ(74)కు కుమారుడు రాజు, కూతురు నాగరాణి ఉన్నారు. రాజు భార్యతో కాలంగా రంగారెడ్డి జిల్లా సురారంలో నివాసం ఉంటున్నాడు. కూతురికి సిద్దిపేట జిల్లా మామిడాల వ్యక్తితో వివాహం జరిపించారు. పోచమ్మ గ్రామంలో ఒంటరిగా నివసిస్తూ కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతుంది. రాజు గతనెల 21న గ్రామానికి వచ్చి తల్లితో నిత్యం కుటుంబ విషయంలో గొడవపడుతున్నాడు. ఈనెల 4న ఊపిరి తీసుకోవడం కష్టంగా మారడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పోచమ్మ మృతి చెందింది. తన తల్లి మృతికి తమ్ముడు రాజు కారణమని నాగరాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

మా బతుకుల్ని రోడ్డు పాలు చేయొద్దు

చిన్నగుండవెల్లి రైతులు వేడుకోలు

సిద్దిపేటరూరల్: జాతీయ రహదారి నిర్మాణం కోసం భూములు తీసుకుని మమ్మల్ని రోడ్డున పడేయొద్దని చిన్నగుండవెల్లి రైతులు అధికారులను వేడుకున్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నగుండవెల్లి గుండా నిర్మించనున్న జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ఎమ్మార్వో వెంకట్‌రెడ్డి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు జాతీయ రహదారి కోసం అధికారులు చేస్తున్న సర్వే పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న చిన్నగుండవెల్లి గ్రామ భూములు విలువ ఎకరానికి రూ.కోటికి పైగా ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొత్త జాతీయ రహదారి మంజూరు చేసి రైతుల భూములు లాక్కుంటుందని వారు ఆరోపించారు. గ్రామం చుట్టూ ఇప్పటికే అండర్‌గ్రౌండ్ టన్నెల్, ఓపెన్ కాలువల పేరుతో సగం భూమిని కోల్పోయామని వారు వాపోయారు. మళ్లీ ఇప్పుడు ఉన్న భూమిని కూడా జాతీయ రహదారి పేరిట లాక్కుంటే తమ జీవితాలు రోడ్డున పడతాయన్నారు. అధికారులు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా గ్రామసభలు ద్వారా చర్చించకుండా వారికి నచ్చిన విధంగా సర్వే చేయడం సరికాదన్నారు. విలువైన భూముల్లో పంటలు పండించుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇప్పుడు మా భూములు తీసుకుంటున్న క్రమంలో తమకు ఎకరానికి రెండు ఎకరాల చొప్పున భూములు అందించి ఉపాధి కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

చెరువులో దూకి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని శేరితండా పంచాయతీ వసురాంతండాలో చోటు చేసుకుంది. బుధవారం ఎస్ఐ రంజిత్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరితండా పంచాయతీ వసురాం తండాకు చెందిన లంబాడీ శ్రీనివాస్(32)కి భార్య అనిత, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. శ్రీనివాస్ ఏ పని చేయకుండా మద్యానికి బానిసై రోజు భార్యతో గొడవపడేవాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో రోజు మద్యం తాగితే ఆడపిల్లల పరిస్థితి ఏంటని భార్య ప్రశ్నించింది. దీంతో భార్యతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయి తండా సమీపంలోని కన్నారం చెరువులో దూకాడు. గ్రామస్తులు, కుటుంబీకులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



లింగం(ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): చేపలు పట్టడానికి వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని చౌడారంలో బుధవారం వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కడారి లింగం(50)కు భార్య పద్మ, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. లింగం భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం పని లేకపోవడంతో ఎల్లమ్మజాలు శివారులోని చెరువుకు చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం చెరువు గట్టు వద్ద చెప్పులు, గాలం వైరు ఉన్నాయి. గాలం వైరు లాగడంతో లింగం మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ బాలకృష్ణ ఘటనా స్థలానికి చేరకొని పరిశీలించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి

చేగుంట(తూప్రాన్): రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు.. బుధవారం మాసాయిపేట రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. కామారెడ్డి రైల్వే హెడ్ కానిస్టేబుల్ రవి ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే కామారెడ్డి రైల్వే పోలీస్‌లను సంప్రదించాలని తెలిపారు.

బావిలో పడి రైతు

మద్దూరు(హుస్నాబాద్): ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన భూషణమైన సాయిలు(71) వ్యవసాయ బావిలోని మోటార్ పంపు పాడైపోవడంతో బావిలోకి దిగి మోటార్ పంపును సరి చేశాడు. అనంతరం పైకి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోయి మృతి చెందాడు.